పాలమూరులో భారీ ర్యాలీ



ప్రధాన రహదారి (ఎన్‌హెచ్‌-167) పై బీఆర్‌ఎస్‌ ర్యాలీ



రోడ్‌షోలో కారు గుర్తు చూపిస్తూ మాట్లాడుతున్న మంత్రి శ్రీనివాస్‌గౌడ్‌

మహబూబ్‌నగర్‌ మున్సిపాలిటీ/మహబూబ్‌నగర్‌ న్యూటౌన్‌/మహబూబ్‌నగర్‌ రూరల్‌: ఎన్నికల ప్రచారంలో భాగంగా శనివారం బీఆర్‌ఎస్‌ నాయకులు జిల్లా కేంద్రంలోని వన్‌టౌన్‌చౌరస్తా నుంచి పద్మావతికాలనీ వరకు రోడ్‌ షో, భారీ ర్యాలీ నిర్వహించారు. ఓపెన్‌ టాప్‌ వాహనంపై నుంచి మంత్రి వి.శ్రీనివాస్‌గౌడ్‌, మాజీ మంత్రి పి.చంద్రశేఖర్‌ తదితరులు ప్రజలకు అభివాదం చేశారు. పదేళ్లలో చేసిన అభివృద్ధిని మంత్రి వివరిస్తూ ముందుకు సాగారు. మరోసారి తనను గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. మార్గమధ్యంలో ఓ హోటల్‌ వద్ద నాయకులతో కలసి టీ తాగారు. ఈ ర్యాలీ అశోక్‌టాకీస్‌చౌరస్తా, అంబేడ్కర్‌చౌరస్తా, తెలంగాణచౌరస్తా, ఎర్రసత్యంచౌరస్తా, పాత డీఈఓ కార్యాలయం చౌరస్తా, శెట్టికాంప్లెక్స్‌, న్యూటౌన్‌, మెట్టుగడ్డ మీదుగా సాగింది. ఈ సందర్భంగా పార్టీ నాయకులు, కార్యకర్తలు దారి వెంట దుకాణాలు, వాణిజ్య సముదాయాలతో పాటు ఇంటింటికీ వెళ్లి ప్రచారం చేశారు. కార్యక్రమంలో డీసీసీబీ వైస్‌ చైర్మన్‌ కె.వెంకటయ్య, మున్సిపల్‌ చైర్మన్‌ కేసీ నర్సింహులు, వైస్‌ చైర్మన్‌ తాటి గణేష్‌కుమార్‌, కౌన్సిలర్లు జి.సంధ్య, పటేల్‌ ప్రవీణ్‌కుమార్‌, కట్టా రవికిషన్‌రెడ్డి, బీఆర్‌ఎస్‌ నాయకులు శివరాజ్‌, శ్రీనివాస్‌రెడ్డి, కృష్ణమూర్తి, సమద్‌ఖాన్‌, హనుమంతు తదితరులు పాల్గొన్నారు.

➡ మహబూబ్‌ నగర్‌ రూపురేఖలు మార్చిన మంత్రి వి శ్రీనివాస్‌ గౌడ్‌కు ప్రైవేటు, రిటైర్డ్‌ పీఈటీల సంఘం తరఫున ఏకగ్రీవంగా మద్దతునిస్తున్నట్లు ఆ సంఘం నాయకులు ప్రకటించారు. శనివారం జిల్లాకేంద్రంలో మంత్రిని కలిసి మద్దతు తెలిపారు. సోహెల్‌, వినోద్‌ కుమార్‌, జియావుద్దీన్‌, భాస్కర్‌, రాజు, హుస్సేన్‌ తదితరులు ఉన్నారు.

➡ ఎన్నికల్లో అబద్ధపు హామీలతో వచ్చే కాంగ్రెస్‌ను నమ్మి మోసపోవద్దని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్‌ బి.రాజేశ్వర్‌గౌడ్‌ అన్నారు. బీఆర్‌ఎస్‌ అభ్యర్థి, మంత్రి శ్రీనివాస్‌గౌడ్‌కు మద్దతుగా శనివారం మండల పరిధిలోని వెంకటాపూర్‌, మాచన్‌పల్లి తండా, రేగడిగడ్డ తండాలలో నాయకులు, కార్యకర్తలు గడపగడపకూ ప్రచారం నిర్వహించారు. ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలు, బీఆర్‌ఎస్‌ మేనిఫెస్టో గురించి వివరించారు. ప్రతి ఇంటికీ ప్రభుత్వ పథకాలు చేరాయని పేర్కొన్నారు. కారు గుర్తుకు ఓటేసి మంత్రి శ్రీనివాస్‌గౌడ్‌ను భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. ప్రచార కార్యక్రమంలో ముడా డైరెక్టర్‌ ఆంజనేయులు, రైతుబంధు సమితి జిల్లా డైరెక్టర్‌ మల్లు నర్సింహారెడ్డి, సర్పంచ్‌లు మంగమ్మ, శోభ, శ్రీనునాయక్‌, బీఆర్‌ఎస్‌ మండల అధ్యక్షుడు శ్రీనివాస్‌యాదవ్‌, నాయకులు పి.రవీందర్‌రెడ్డి, రంగయ్య, రమేష్‌నాయక్‌, కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

➡ హన్వాడ మండలం తిరుమలగిరి ఉప సర్పంచ్‌ వేపూరు రాములు తిరిగి సొంత గూటికి చేరుకున్నారు. శనివారం జిల్లాకేంద్రం న్యూ టౌన్‌ లోని బీఆర్‌ఎస్‌ పార్టీ కార్యాలయంలో మంత్రి వి శ్రీనివాస్‌ గౌడ్‌ సమక్షంలో అధికార పార్టీలో చేరారు. బలహీన వర్గాలకు న్యాయం జరుగుతుందని భావించి తిరిగి సొంతగూటికి వచ్చినట్లు ఉప సర్పంచ్‌ తెలిపారు.

➡ మహబూబ్‌ నగర్‌ పట్టణంలోని వార్డు నెంబర్‌ 29కు చెందిన కాంగ్రెస్‌ నాయకులు ఇసాక్‌ ఖాద్రి, బాబా, 25వ వార్డు నాయకులు సయ్యద్‌ అఖీల్‌, రహమాన్‌, మునావర్‌, ఇర్షాద్‌ తదితరులు మంత్రి వి శ్రీనివాస్‌ గౌడ్‌ సమక్షంలో అధికార బీఆర్‌ఎస్‌ పార్టీలో చేరారు.

➡ బీఆర్‌ఎస్‌ ప్రభుత్వంలోనే గిరిజనులకు పెద్దపీట వేశారని గిరిజన విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వెంకట్‌ బంజారా అన్నారు. మంత్రి శ్రీనివాస్‌గౌడ్‌కే తమ సంపూర్ణ మద్దతు తెలుపుతున్నట్లు తెలిపారు. శనివారం జిల్లాకేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. గిరిజనులకు అన్ని విధాలుగా అండగా నిలుస్తున్న మంత్రి శ్రీనివాస్‌గౌడ్‌ను మరోసారి గెలిపించాల్సిన అవసరముందని అన్నారు. జీవీఎస్‌ జిల్లా అధ్యక్షుడు రవీందర్‌ నాయక్‌ పాల్గొన్నారు.

బీసీలంటే రేవంత్‌రెడ్డికి చిన్నచూపు

బీసీలంటే టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌ రెడ్డికి చిన్నచూపని మంత్రి వి.శ్రీనివాస్‌గౌడ్‌ విమర్శించారు. బడుగు, బలహీనవర్గాలకు కాంగ్రెస్‌ పార్టీలో ఏ మాత్రం గుర్తింపులేదన్నారు. శనివారం రాత్రి స్థానిక గాలివీధి నుంచి పాన్‌ చౌరస్తా వరకు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. అనంతరం కార్నర్‌ మీటింగ్‌లో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ఎక్కడా లేనివిధంగా మహబూబ్‌నగర్‌ను తాము అభివృద్ధి చేస్తున్నామన్నారు. తనకు మరోసారి అవకాశం కల్పించాలని కోరారు.



మంత్రి శ్రీనివాస్‌గౌడ్‌తో ప్రైవేటు, రిటైర్డ్‌ పీఈటీల సంఘం



వెంకటాపూర్‌లో మాట్లాడుతున్న, గ్రంథాలయ సంస్థ చైర్మన్‌ రాజేశ్వర్‌గౌడ్‌

బీఆర్‌ఎస్‌వి డొల్ల పథకాలు



దాచక్‌పల్లిలో ఘనస్వాగతం పలుకుతున్న నాయకులు



పెద్దర్పల్లిలో మాట్లాడుతున్న డీకే అరుణ

పాలమూరు/హన్వాడ: బీఆర్‌ఎస్‌ డొల్ల పథకాలను, కాంగ్రెస్‌ ప్రకటించిన ఆరు గ్యారెంటీ పథకాలను ప్రజలు నమ్మే పరిస్థితి లేదని బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ అన్నారు. శనివారం ఆమె మిథున్‌రెడ్డికి మద్దతుగా మండల పరిధిలోని పల్లెమోనికాలనీ, దాచక్‌పల్లి, పెద్దర్పల్లి గ్రామాల్లో ఎన్నికల ప్రచారం చేశారు. రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి వస్తే ప్రతీ నిరుపేదకు పీఎం ఆవాస్‌ యోజన పథకం కింద సొంతింటి కళను నెరవేరుస్తామని భరోసా ఇచ్చారు. రైతులను కడుపులో పెట్టుకుని చూసేది బీజేపీ ప్రభుత్వమేనని, వరి పండించే రైతులకు క్వింటాలు రూ.3100ల మద్దతు ఇస్తున్నారన్నారు. అదేవిధంగా మహిళలకు నూటికి ఒక్కశాతం వడ్డీతో రుణాలు మంజూరు చేసి ఉపాధి అవకాశాలు మెరుగుపరుస్తామని భరోసా ఇచ్చారు. గర్భిణులకు ఇంద్రధనుస్సు పథకం కింద పౌష్టికాహారం అందిస్తున్నామన్నారు. నిరుద్యోగులకు 5 ఎకరాల స్థలంలో స్కిల్‌ డెవలప్మెంట్‌ సెంటర్‌ ఏర్పాటు చేసి శిక్షణ ఇప్పించి ఉపాధి అవకాశాలు కల్పిస్తామని పేర్కొన్నారు. అవసరం ఉండి అడిగిన వారికి దేశీ ఆవును ఉచితంగా పంపిణీ చేస్తామని వివరించారు. డిగ్రీ పూర్తి చేసిన ప్రతి విద్యార్థినికి ఉచితంగా ల్యాప్‌టాప్‌ను పంపిణీ చేస్తామన్నారు. పుట్టిన ప్రతి ఆడబిడ్డకు రూ.2లక్షలు బ్యాంకులో డిపాజిట్‌ చేయనున్నామని వివరించారు.



పెద్దర్పల్లిలో వృద్ధురాలితో మాట్లాడుతున్న మిథున్‌రెడ్డి

హన్వాడలో డిగ్రీ కళాశాల

ఎన్నిక ప్రచారం సందర్భంగా బీజేపీ అభ్యర్థి మిథున్‌రెడ్డి మండలకేంద్రంలో జూనియర్‌, డిగ్రీ కళాశాల మంజూరు చేస్తామని భరోసా ఇచ్చారు. సమీకృత కూరగాయల మార్కెట్‌ను నిర్మించి రైతులకు, వ్యాపారస్తులకు అన్ని వసతులు కల్పిస్తామన్నారు. కార్యక్రమంలో జిల్లా పార్టీ కార్యదర్శి బుచ్చిరెడ్డి, మండల అధ్యక్షుడు వెంకటయ్య, నాయకులు లింగం, కేశవులు, రఘునాథ్‌గౌడ్‌ తదితరులు పాల్గొన్నారు. మహబూబ్‌నగర్‌ నియోజకవర్గ బీజేపీ అభ్యర్థి ఏపీ మిథున్‌రెడ్డికి మద్దతుగా శనివారం జిల్లాకేంద్రంలోని ముఖ్య కూడళ్లలో నరేంద్ర మోదీ వలంటీర్స్‌ విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. ప్రో నమో, నమో సేవ సంఘ్‌, ఐ సపోర్ట్‌ మోదీ టీమ్‌లు ప్రచారం నిర్వహించాయి. ప్రధానంగా మహబూబ్‌నగర్‌ ఆర్టీసీ బస్టాండ్‌, వెంకటేశ్వర కాలనీ, రాం మందిర్‌ చౌరస్తా ఇతర ప్రాంతాల్లో మోదీ బొమ్మ, కమలం గుర్తులతో పాటు బీజేపీ జెండాలను ప్రదర్శించారు.

మహబూబ్‌నగర్‌ మున్సిపాలిటీ: ఒకసారి అసెంబ్లీకి వెళ్లే అవకాశం ఇవ్వాలని బీజేపీ అభ్యర్థి ఏపీ మిథున్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు. శనివారం రాత్రి స్థానిక 27, 43వ వార్డుల పరిధిలోని వల్లభ్‌నగర్‌, గణేష్‌నగర్‌, వేపురిగేరి, రాంనగర్‌ తదితర ప్రాంతాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో మంత్రి శ్రీనివాస్‌గౌడ్‌, అతని అనుచరుల ఆగడాలు, దౌర్జన్యాలు పెరిగిపోయాయని ఆరోపించారు. ఇకనైనా పాలమూరు ప్రజలు 'కారుకు బైబై.. కాంగ్రెస్‌కు నైనై.. బీజేపీకి జైజై..' అని చెప్పాలన్నారు

ఘనంగా ఎన్‌సీసీ డే

మహబూబ్‌నగర్‌ ఎడ్యుకేషన్‌: జిల్లా కేంద్రంలోని తిరుమల హిల్స్‌ వద్ద ఉన్న ఎస్టీ గురుకులాల్లో శనివారం ఎన్‌సీసీ డే ఘనంగా నిర్వహించారు. ప్రిన్సిపాల్‌ సంగీత తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా జేపీఎన్‌సీ ఇంజనీరింగ్‌ కళాశాలలో నిర్వహించిన కార్యక్రమంలో ఫోరం ఫర్‌ గుడ్‌ గవర్నెన్స్‌ అధ్యక్షుడు పద్మానాభరెడ్డి, కళాశాల చైర్మన్‌ రవికుమార్‌ తదితరులు పాల్గొన్నారు.

పోస్టల్‌ బ్యాలెట్‌లు ఇవ్వాలి

మహబూబ్‌నగర్‌ ఎడ్యుకేషన్‌ : ఎన్నికల శిక్షణలో ఉన్న ప్రభుత్వ సిబ్బందికి సకాలంలో పోస్టల్‌ బ్యాలెట్‌లు అందించాలని టీపీసీసీ అధికార ప్రతినిధి హర్షవర్ధన్‌రెడ్డి, టీజేఏసీ నాయకులు రాజేందర్‌రెడ్డి మహబూబ్‌నగర్‌ ఎన్నికల రిటర్నింగ్‌ అధికారి అనిల్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. బెక్కరి అనిత మధుసూదన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

భారత పౌరులకు రాజ్యాంగమే రక్ష

చిన్నచింతకుంట: అప్పంపల్లి ఉన్నత పాఠశాలలో రాజ్యాంగ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. రాజ్యాంగ ప్రతిజ్ఞ చేయించారు. ఉపాధ్యాయులు రవిశంకర్‌, చక్రవర్తి గౌడ్‌ మాట్లాడుతూ భారత పౌరులకు రాజ్యాంగమే రక్షణ కవచంగా నిలుస్తుందన్నారు. ఎల్లయ్య, సుశీల పాల్గొన్నారు.

కొనసాగిన ప్రచారం

సాక్షినెట్‌వర్క్‌: కాంగ్రెస్‌ అభ్యర్థి జి మధుసూదన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే సీతా దయాకర్‌రెడ్డి నియోజకవర్గ పరిధిలో శనివారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు కాంగ్రెస్‌ పార్టీలో చేరారు.

దేవరకద్ర నియోజకవర్గ కేంద్రంలో ఆదివారం జరిగే కాంగ్రెస్‌ విజయభేరి సభకు భారీ ఎత్తున ఏర్పాట్లను చేశారు. రేవంత్‌రెడ్డి హాజరుకానున్నారు. మధుసూదన్‌రెడ్డి సభ ఏర్పాట్లను పరిశీలించారు.



ఓటుపై అవగాహన

మహబూబ్‌నగర్‌ ఎడ్యుకేషన్‌: జిల్లా కేంద్రంలోని ఎంవీఎస్‌ డిగ్రీ కళాశాలలో ఓటుపై అవగాహన కల్పించారు. ప్రిన్సిపాల్‌ పద్మావతి విద్యార్థులు తప్పకుండా ఓటు హక్కును వినియోగించుకోవాలని, తల్లిదండ్రులకు సైతం ఓటుపై అవగాహన కల్పించాలని అన్నారు. నాగేంద్రస్వామి, రిటైర్డ్‌ అధికారులు బాలయ్య, రమేష్‌ పాల్గొన్నారు.

ప్రతి గడపకూ పథకాలు



స్టేషన్‌ మహబూబ్‌నగర్‌: కాంగ్రెస్‌ ప్రతి గడపకు సంక్షేమ పథకాలు అందజేస్తుందని ఎమ్మెల్యే అభ్యర్థి యెన్నం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. హన్వాడ మండలంలోని టంకర, బుద్దారంతోపాటు పట్టణంలోని క్రిస్టియన్‌కాలనీ, ఇతర ప్రాంతాల్లో యెన్నం శ్రీనివాస్‌రెడ్డి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఆదివారం జిల్లా కేంద్రానికి టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి వస్తారని క్లాక్‌టవర్‌ వద్ద మధ్యాహ్నం 12 గంటలకు కార్నర్‌ మీటింగ్‌ ఉంటుందని వివరించారు. ఎస్‌పీ వెంకటేశ్‌, సురేందర్‌రెడ్డి, రఘునాయక్‌, రాము నాయక్‌, రాజునాయక్‌ తదితరులు పాల్గొన్నారు.

హైవేపై కొనసాగుతున్న తనిఖీలు



అడ్డాకుల: ఎన్నికలు సమీపిస్తున్న వేళ జాతీయ రహదారిపై అడ్డాకుల మండలం శాఖాపూర్‌ టోల్‌ప్లాజా వద్ద తనిఖీలు ముమ్మరంగా చేస్తున్నారు. ఎన్నికల కోడ్‌ మొదలైన నాటి నుంచి చెక్‌పోస్టును ఏర్పాటు చేసి పోలీసులు వాహనాల తనిఖీ చేస్తున్నారు. 24 గంటలు రహదారిపై వెళ్లే వాహనాలపై నిఘా పెంచారు. నగదు, మద్యం రవాణాపై నిఘా పెంచారు.

పాఠశాలల్లో మాక్‌ పోలింగ్‌



సాక్షినెట్‌వర్క్‌: జిల్లాలోని పలు ప్రభుత్వ పాఠశాలల్లో శనివారం మాక్‌ పోలింగ్‌ నిర్వహించారు. విద్యార్థులకు ఎన్నికల సరళిపై అవగాహన కలిగించారు. బాదేపల్లి, గంగాపురం, రాజాపూర్‌ మండలంలోని తిర్మలాపూర్‌, మహబూబ్‌నగర్‌ మున్సిపాలిటీ పరిధిలోని బోయపల్లి హైస్కూల్‌, జిల్లా కేంద్రంలోని రెయిన్‌బో పాఠశాలలో కార్యక్రమాలు నిర్వహించారు.

దరఖాస్తుల ఆహ్వానం

జడ్చర్ల టౌన్‌: ప్రవేశ పరీక్ష రాయకుండానే నేరుగా ఎమ్మెస్సీ బోటనీలో ప్రవేశం పొందే అవకాశం కల్పిస్తున్నట్లు స్థానిక ప్రభుత్వ డిగ్రీ, పీజీ కళాశాల ప్రిన్సిపాల్‌ డా. అప్పియా చిన్నమ్మ శనివారం తెలిపారు. విద్యార్థులు ధ్రువపత్రాలతో ఈ నెల 27న సోమవారం కళాశాలకు రావాలని సూచించారు. 26న సైతం దరఖాస్తులు స్వీకరిస్తామన్నారు.

కారు బోల్తా: ఇద్దరికి తీవ్ర గాయాలు

దేవరకద్ర రూరల్‌: అదుపు తప్పి కారు బోల్తా పడి, ఇద్దరికి తీవ్ర గాయాలైన ఘటన శనివారం మండల పరిధిలో చోటు చేసుకుంది. వివరాల ప్రకారం... ఆజిలాపూర్‌ సర్పంచ్‌ విశ్వనాథం, మహబూబ్‌ అలీతో కలిసి శనివారం హైదరాబాద్‌ నుంచి స్వగ్రామానికి కారులో వెళ్తుండగా తెల్లవారుజామున నాగారం స్టేజ్‌ సమీపంలో వాహనం అదుపుతప్పి బోల్తాపడింది. ఘటనలో ఇరువురికి తీవ్రగాయాలు కాగా, స్థానికులు క్షతగాత్రులను చికిత్స నిమిత్తం జిల్లా కేంద్రంలోని ప్రైవేట్‌ ఆస్పత్రికి తరలించారు.

కాంగ్రెస్‌ కోసం ప్రజల ఎదురుచూపులు



ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే అభ్యర్థి అనిరుధ్‌రెడ్డి

నవాబుపేట: కాంగ్రెస్‌ పాలన కోసం ప్రజలు ఎదురు చూస్తున్నారని, బీఆర్‌ఎస్‌ నియంత పాలనలో విసిగిపోయిన వారు తెలంగాణ ఇచ్చిన సోనియా గాంధీ రుణం తీర్చుకునేందుకు సిద్ధంగా ఉన్నారని జడ్చర్ల అభ్యర్థి అనిరుధ్‌రెడ్డి అన్నారు. శనివారం కొల్లూర్‌, పోమాల్‌, కామారం, రుద్రారం, కేశవరావుపల్లి గ్రామాల్లో ప్రచారంలో పాల్గొని ప్రసంగించారు. తెలంగాణ వచ్చాక ప్రజల తలరాతలు మారుస్తామని చెప్పిన కేసీఆర్‌ కేవలం ఆయన స్వార్థ రాజకీయాలకు మాత్రమే పెద్దపీట వేశారని విమర్శించారు. నియంత పాలనకు చరమగీతం పాడాలని కోరారు. జడ్చర్లలో ఎక్కడా అభివృద్ధి జరగలేదని.. శంకుస్థాపనలు మినహా పనుల జాడలేదని ఆరోపించారు. తమకు ఒకసారి అవకాశం ఇవ్వాలని కోరారు. ఈ సంధర్భంగా వివిధ పార్టీలకు చెందిన నాయకులు కాంగ్రెస్‌లో చేరారు. జిల్లా నాయకులు నర్సింహచారీ, బంగ్లారవి, మండల అధ్యక్షుడు రాంచంద్రయ్య, డాక్టర్‌ మీనాక్షి, తులసీరాంనాయక్‌, వాసుయాదవ్‌, ఆంజనేయులు, కుమార్‌, హమీద్‌, అశోక్‌, నరేష్‌ తదితరులు పాల్గొన్నారు.

గీత వృత్తిదారులకు పెద్దపీట



మరికల్‌లో పార్టీలో చేరిన వారితో ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి

నారాయణపేట/కోయిల్‌కొండ/మరికల్‌/ధన్వాడ/దామరగిద్ద : సీఎం కేసీఆర్‌ నేతృత్వంలో కల్లు గీత కార్మికులకు బీఆర్‌ఎస్‌ ప్రభుత్వం పెద్దపీట వేసిందని అభ్యర్థి, సిట్టింగ్‌ ఎమ్మెల్యే ఎస్‌.రాజేందర్‌రెడ్డి అన్నారు. సింగారం సమీపంలో శనివారం గౌడ సంఘం ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొని మాట్లాడారు. గౌడ కులస్తులను కొనియాడారు. రాజేందర్‌రెడ్డిని గెలిపించడం వారికి పెద్ద విషయం కాదన్నారు. బీఆర్‌ఎస్‌ ఉమ్మడి పాలమూరు జిల్లా మాజీ అధ్యక్షుడు విఠల్‌రావు ఆర్య, పేట ఎన్నికల ఇన్‌చార్జ్‌ దేవరి మల్లప్ప, బస్వరాజ్‌గౌడ్‌, జ్ఞానేశ్వర్‌గౌడ్‌, గురునాథ్‌గౌడ్‌ తదితరులు పాల్గొన్నారు.

➡ మరికల్‌ మండల బీజేపీ, బీజేవైఎం నాయకులు ఎమ్మెల్యే ఆధ్వర్యంలో శనివారం పార్టీలో చేరారు. మండల ప్రధాన కార్యదర్శి జానకి రాములు, గ్రామ ప్రధాన కార్యదర్శి మోనేష్‌గౌడ్‌, నర్సింహులు తదితరులు ఉన్నారు.

➡ కాంగ్రెస్‌ నుంచి బుడగ జంగం నారాయణపేట జిల్లా అధ్యక్షుడు ఆర్‌.శ్రీనివాసులు, దామరగిద్ద మండలం మద్దెల్‌బీడు గ్రామానికి చెందిన 30 మంది యువకులు ఎమ్మెల్యే సమక్షంలో పార్టీలో చేరారు. నారాయణపేట మండలంలోని మేకహనుమాన్‌ తండా కాంగ్రెస్‌, బీజేపీకి చెందిన కార్యకర్తలు బీఆర్‌ఎస్‌ తీర్థం పుచ్చుకున్నారు.

➡ కష్టపడి సాధించుకున్న తెలంగాణ రాష్ట్రాన్ని కాంగ్రెస్‌కు అప్పగిస్తే ఆగమయిపోతామని ఎమ్మెల్యే ఎస్‌. రాజేందర్‌రెడ్డి అన్నారు. శనివారం మరికల్‌ మండలంలో రోడ్‌షో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్యారంటీ లేని పథకాల పేర్లను చెప్పి అధికారంకోసం తాప్రతాయ పడుతున్న కాంగ్రెస్‌ను ప్రజలు నమ్మే స్థితిలో లేరన్నారు. ప్రజలు ఆలోచన చేసిఓటు వేయాలన్నారు.

➡ మూడోసారి అధికారంలోకి వస్తే ఎన్నికల హామీలను పూర్తిగా నేరవేరుస్తామన్నారు. ప్రస్తుతం రైతులకు యాసంగి రైతుబంధు విడుదల చేశామన్నారు. దేవుడు బీఆర్‌ఎస్‌ పక్షాన ఉండటంతో యాసంగి రైతుబంధు రైతుల ఖాతాలో వేసేందుకు ఎన్నికల కమిషనర్‌ గ్రీన్‌సిగ్నల్‌ ఇచ్చారన్నారు. ప్రభుత్వం చేసిన అభివృద్ధి చూసి బీఆర్‌ఎస్‌కు ఓటు వేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జెడ్పీవైస్‌ చైర్మన్‌ సురేఖ, ఎంపీపీ శ్రీకళ, తిరుపతయ్య, కృష్ణారెడ్డి, లక్ష్మయ్య, బసంత్‌, సంపత్‌, రాజేష్‌, మల్లేష్‌, శేఖర్‌ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి

బీఆర్‌ఎస్‌తోనే అభివృద్ధి సాధ్యం

బీఆర్‌ఎస్‌ పార్టీ అధికారంలోకి రావడంతోనే రాష్ట్ర అభివృద్ధి సాధ్యమవుతుందని మాజీఎమ్మెల్యే ఎర్రశేఖర్‌ అన్నారు. ఎస్‌.రాజేందర్‌రెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఆయన శుక్రవారం కోయిల్‌కొండ మండలంలోని కోత్లాబాద్‌లో ప్రచారం నిర్వహించారు. నియోజకవర్గ సమన్వయకర్త రవీందర్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ రాజీరెడ్డి, నాయకులు విద్యాసాగర్‌, మాధువులు, విజయ్‌భాస్కర్‌రెడ్డి, భీంరెడ్డి, చంద్రశేఖర్‌, పెంటన్న, కనకయ్య, వెంకటయ్య శ్రీనివాస్‌, మాదవరెడ్డి, గోపాల్‌, సాయిరాం పాల్గొన్నారు.

ధన్వాడలో మండల ఉపాధ్యక్షుడు సురేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో ప్రచారం సాగింది.

దామరగిద్ద మండలంలోని వివిధ గ్రామాల్లో బీఆర్‌ఎస్‌ పార్టీ ముమ్మరంగా ప్రచారం కొనసాగింది.

కోయిలకొండ మండలం శేరివెంకటపూర్‌లో శనివారం ఎమ్మెల్యే ఎస్‌.రాజేందర్‌రెడ్డి మాతృమూర్తి ఎస్‌.యశోదాదేవి పోస్టల్‌ బ్యాలెట్‌ ద్వారా తన ఓటు హక్కును సద్వినియోగం చేసుకున్నారు.

కేసీఆర్‌తోనే అభివృద్ధి సాధ్యం



అమిస్తాపూర్‌లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి

భూత్పూర్‌/చిన్నచింతకుంట/కొత్తకోట/కొత్తకోట రూరల్‌: సీఎం కేసీఆర్‌తోనే అభివృద్ధి సాధ్యమని ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి అన్నారు. శనివారం భూత్పూర్‌ పట్టణంతో పాటు అమిస్తాపూర్‌, సిద్దాయిపల్లి గ్రామాల్లో ఎంపీ మన్నె శ్రీనివాస్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే ఎర్రశేఖర్‌తో కలిసి రోడ్‌షో నిర్వహించారు. తెలంగాణ కోసం సీఎం కేసీఆర్‌ ప్రాణాన్ని పణంగా పెట్టి ఉద్యమం చేశారని అన్నారు. దేశంలోని ఏ సీఎం చేయనన్ని అభివృద్ధి, సంక్షేమ పథకాలు తెలంగాణాలో అమలు అవుతున్నాయని అన్నారు. భూత్పూర్‌, అమిస్తాపూర్‌తో కలిపి మున్సిపాలిటీ ఏర్పాటు చేశామని.. మరింత అభివృద్ధి చేస్తామని వివరించారు. అమిస్తాపూర్‌ , సిద్దాయిపల్లి రహదారిని బీటీ రోడ్డుగా మార్చడంతో పాటు సిద్దాయిపల్లి వద్ద 288 మందికి డబుల్‌బెడ్‌రూం ఇళ్లు నిర్మించి బీదలకు ఇచ్చినట్లు పేర్కొన్నారు. ప్రతి ఇంటికీ సంక్షేమ ఫలాలు ఏదోరకంగా అందుతున్నాయని.. మరోసారి కారు గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని కోరారు. మున్సిపల్‌ చైర్మన్‌ బస్వరాజ్‌ గౌడ్‌, సీనియర్‌ నాయకులు నారాయణ గౌడ్‌, మురళీధర్‌ గౌడ్‌, మందడి సరోజ్‌ రెడ్డి పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌ పార్టీలో చేరికలు

చిన్నచింతకుంట మండలంలోని లాల్‌కోట, గోప్యానాయక్‌ తండాకు చెందిన వివిధ పార్టీల నాయకులు శనివారం అన్నసాగర్‌లో బీఆర్‌ఎస్‌ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి ఆల వెంకటేశ్వరెడ్డి సమక్షంలో బీఆర్‌ఎస్‌ పార్టీలో చేరారు. బోయ వెంకటేష్‌, హరిజన్‌ వెంకటేష్‌, ఆనంద్‌గౌడ్‌, చాకలి నర్సింహులు, వావలి అంజన్న, డ్రైవర్‌ రాములు తదితరులు ఉన్నారు.

➡ కొత్తకోట పట్టణ కేంద్రంలో పలువరు కౌన్సిలర్‌ నాగన్న సాగర్‌ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే సమక్షంలో పార్టీలో చేరారు. ఎమ్మెల్యే సతీమణి ఆల మంజుల ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఎమ్మెల్యే శనివారం రాత్రి ఆమడబాకుల, సత్యహళ్లి, బూత్‌కూర్‌, అప్పరాల, పామాపురం గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. జెడ్పీవైస్‌ చైర్మన్‌ వామన్‌గౌడ్‌, ఎంపీపీ గుంత మౌనిక, సీడీసీ చైర్మన్‌ చెన్నకేశవరెడ్డి, శ్రీనివాసులు ఉన్నారు.